# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శుక్రవారం | 28 నవంబరు, 2025 | పేజీలు : 08

## ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దు



2 లో



## నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**ప్రజాపక్షం/ సంగారెడ్డి** :నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం కంది మండలం కౌలంపేట, కాశీపూర్, గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గ్రామపంచాయతీ ఎన్నికల సాదారణ పరిశీలకులు ఉదయ్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సహాయ రిటర్నింగ్ అదికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎన్నికల నామినేషన్ దరఖాస్తు పారాలు సరిపడినన్ని అందుబాటులో ఉంచుకోవాలని రిటర్నింగ్ తరువాయి 2లో

## సురభి మెడికల్ కళాశాలల్లో ర్యాగింగ్ కలకలం






**ప్రజాపక్షం/ సిద్దిపేట** : సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గ్రామంలోని సురభి మెడికల్ కళశాలలో ర్యాగింగ్ కలంకలం సృష్టించింది. కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థిని సమీర్‌రాజ్ కృష్ణ ను సీనియర్ తరువాయి 2లో

పట్టించుకోని కళాశాల యజమాన్యం
త్రీటౌన్ పోలీసులకు బాధితుల ఫిర్యాదు..
కేసు నమోదు చేసిన పోలీసులు

## నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు

### ఇంప్లిమెంట్ కమిటీ సభ్యులపై కలెక్టర్ ఆగ్రహం



**ప్రజాపక్షం/గజ్వేల్:**విద్యార్థులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం పెట్టకుంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. గురువారం అక్కాంరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక నిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆమె మెనూలో భాగంగా బగారా అన్నం, తోటకూర పప్పు వండినట్లుగా వంట సిబ్బంది తెలుపగా, ఆహారపదర్థాలను రుచి చూశారు. బాగారా అన్నం నాణ్యత సరిగ్గా లేనందున వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు ఇలాగే పెడుతున్నారా? అని నిలదీస్తూ బాగారా అన్నం ఎలా చేస్తారో తెలీదా? అని కలెక్టర్ మండిపడ్డారు. పిల్లలకు పౌష్టికాహారం అందించకుండా విధులు ఎలా నిర్వహిస్తున్నారని ప్రధానోపాధ్యాయులు, ఫుడ్ చెకింగ్ టిచర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామన్ డైట్ మెనూ పాటించాలని, రోజు మధ్యాహ్న భోజన వంట ప్రక్రియను పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. చదువు, ఆహారం విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని ఉపాధ్యాయులను కలెక్టర్ హైమావతి ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



## మహా మేడారం జాతరను సమన్వయంతో విజయవంతం చేద్దాం

### జిల్లా ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్

**ప్రజాపక్షం/ములుగు:**వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరుగనున్న మహా మేడారం జాతరను పాత్రికేయులు, పోలీస్ సిబ్బంది, జిల్లా యంత్రాంగంతో కలిసి సమన్వయంగా విజయవంతం చేద్దామని జిల్లా ఎస్పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. గత జాతర సందర్భంగా జరిగిన సంఘనటలు పునరావృత కాకుండా ముందస్తు ప్రణాళిక సిద్దం చేసుకొని అందరితో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పాత్రికేయులతో సమన్వయ కమిటీ సమావేశం ఓఎస్‌డి శివం ఉపాధ్యాయ, డిఎస్‌పి రవీందర్‌లతో కలిసి ఎస్‌పి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కేకన్ మాట్లాడుతూ రానున్న మహా జాతరకు కోటి 50లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవడానికి పదివలే మంది పోలీస్ సిబ్బంది నియమిస్తున్నామని, మేడారంలోని అమ్మవార్ల గద్దెల వద్ద మాస్టర్ ప్లాన్‌తో పనులు కొనసాగుతున్నాయని వివరించారు. జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడానికి అందరికి ఒకే నిబంధనలు ఉంటాయని, 99 శాతం ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళిక సిద్దం చేసుకుందామని తెలిపారు. గతంలో రెండు జాతర సందర్భంగా పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులకు దిశా నిర్ధేశం చేస్తున్నానని, భక్తులకు ఇబ్బంది కల్గకుండా అమ్మవార్లకు అదనంగా మరో ఐదు క్యూలైన్లను ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. 8 క్యూలైన్లను ఏర్పాటు చేయబోతున్నామని తరువాయి 2లో

## సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్లు షురూ

### మొదటిరోజు ముల్కనూర్‌సర్పంచ్‌కి నాలుగు నామినేషన్లు

**ప్రజాపక్షం/భీమదేవరపల్లి** : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ లో ఎప్పుడు ఎప్పుడా అని ఎదురు చూసిన సర్పంచ్ ఎన్నికలు నామినేషన్లు రానే వచ్చాయి. ముల్కనూర్ లో చూసినట్లయితే రిజర్వేషన్లు మొదలైన నాటి నుండి మేజర్ గ్రామపంచాయతీలో ఒక్కసారి కూడా జనరల్ రాకపోవడం ఈసారి జనరల్ ఇవ్వడంతో పోటీ ఎక్కువైంది. జనరల్ కేటగిరిలో ఓసి అభ్యర్థులు మరియు బీసీల నుండి ఆశావాహులు ఎక్కువయ్యారు. జనరల్ స్థానం కావడంతో రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు పోటీ చేయడానికి ముందుకు వస్తున్నారు. మరి ముఖ్యంగా యువత కూడా పోటీలో ఉండటం గమనార్హం. తొలి రోజు అప్పని పద్మ మాజీ ఎంపీటీసీ బీఆర్‌ఎస్ నాయకురాలు కావడం ఆమెకు కలిసొచ్చే అంశం. తాను చేసిన పనులు తనని గెలిపిస్తాయని నమ్మకంతో పోటీలో నిలవడం జరిగింది. అంతేకాకుండా పోటీ చేస్తున్న వారిలో మహిళా అభ్యర్థి ఒక్కరే ఉండటం కొంత కలిసొచ్చే అంశంగా చెప్పుకుంటుంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ చొల్లేటి ప్రకాశం మేనల్లుడు అరోరా కాలేజీ యజమాని సుద్దాల సంపత్ సర్పంచ్‌గా నామినేషన్ వేయడం జరిగింది. తన సామాజిక వర్గం అంతా కూడా తన వెంట వచ్చి తన నామినేషన్ లో సహకరించడం జరిగింది. యువ నాయకుడు కాంగ్రెస్ పార్టీ లీడర్ యువతలో మంచి క్రేజ్ ఉన్న నాయకుడు జాలి ప్రమోద్ రెడ్డి మొదటిరోజు నామినేషన్ వేయడం జరిగింది యువత రాజకీయాల్లోకి రావాలని రాజకీయాల్లో యువత ప్రాముఖ్యత భవిష్యత్ తరాలకు మంచి పాలన తో ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో ముందడుగు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ వార్డు మెంబర్ మాజీ సర్పంచ్ కంటెస్టెంట్ ఐన మాదుగుల గోపి గత ఎన్నికల్లో తాను ఒడిన ప్రజల మనసుల్లో చేరువయ్యానని ఈసారి తనకు ప్రజల నుంచి మద్దతు లభిస్తుందని తెలిపాడు.





# ఆరోగ్యంపై పెను ప్రభావం చూపిస్తున్న చలి

## చిన్న పిల్లలు వృద్ధుల్లో అధికంగా అనారోగ్యం బారిన పడే అవకాశం

## మీడియాతో హోమియో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి చైతన్య





**ప్రజాపక్షం/గూడూరు:** చలికాలం వచ్చిందంటే ముఖ్యంగా చిన్న పిల్లల్లో వృద్ధుల్లో ఆనారోగ్య సమస్యలు మొదలువుతుంటాయి వీటిని అధిగమించేందుకు హో మియో వైద్యశాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యాధికారి చైతన్య మీడియా ద్వారా పలు సూచనలు చే శారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ గతంలో చలికాలం వస్తే చర్మం పోడిబారిపోయి పెదవులు పగిలిపోవడం కొందరికి రక్షం సైతం కారడం జరుగుతుంది.ఈ మధ్యకాలంలో అనేక కంపెనీలు క్రీములు తయారు చేస్తూ వాడటం ద్వారా తీవ్రమైన చర్మ వ్యాధులు సంభవిస్తూన్నాయని గతంలో ఏ విధంగా అయితే వెన్నతో చేసిన నెయ్యి రాసుకున్నారు. ఇప్పుడు కూడా అదేవిధంగా రాసుకుంటే చర్మం ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో చలి తీవ్రతను బట్టి చలిమంటలు వేసుకుంటారు.అయితే చలిమంటలు వేసుకోనే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున చిన్న పిల్లలు దాని దగ్గరికి వచ్చేందుకు నిరాకరించాలని మోకాళ్ల వరకు బట్టలు కట్టుకోని చలి కాగలని అన్నారు. ప్రయాణాలు చేయాలనుకుంటే ముఖ్యంగా రాత్రిపూట వాయిదా వేసుకోవడం మంచిదని ఒక వేళ వెళ్లాల్సి వస్తే చెవులకు ముక్కుకు చేతులకు తగిన జాగ్రత్తలు పాటించాలని స్వెటర్స్ దస్తీలు లాంటివి కప్పుకొని వెళ్లాలని అన్నారు.చలికాలంలో చిన్నపిల్లలు తడుచు .లుబుకు గురయ్యే ప్రమాదం ఉంది.కాబట్టి తీపి పదార్థాలను దూరంగా పెట్టాలని సూచించారు.రాత్రిపూట అరటిపండును అవాయిడ్ చేయాలని అదేవిధంగా పెరుగు లాంటివి రాత్రిపూట తీనకపోవడం మంచిదని అన్నారు.గ్రామాల్లో ఎక్కువ శాతం చలితీవ్రత ఉంటుంది కాబట్టి వృద్ధాప్యంలో ఉన్నవారు ఉదయం సాయత్రం కాలంలో బయట తిరకుండా ఎక్కువ శాతం బ్లాంకెట్స్ కప్పుకోని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని అమె తెలిపారు.

## నామినేషన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి)



అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణలో ఏలాంటి ఆపోహలకు తావు లేకుండా రిటర్నింగ్ అధికారులు పారదర్శికంగా వ్యవహరించాలన్నారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులు తప్పని సరిగాజీరో బ్యాంక్ బ్యాలేన్స్ అకౌంట్ వివరాలను సమర్పించాలని వాటిని ఖచ్చితంగా నామినేషన్ల ప్రక్రియ మూసేలోపు అందజేసేలా అభ్యర్థులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీలకు సంబందించి వచ్చిన నామినేషన్ల దరఖాస్తు వివరాలను ఎన్నికల సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైనట్లు తెలిపారు. సంగారెడ్డి డివిజన్ లోని ఏడు మండలాలలోని 136 గ్రామ పంచాయితీలకు సంబందించి మొదటి విడతలో ఎన్నికలు జరగనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాలో గురువారం ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడదల చేయడంతో పాటు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కోసం 43 మంది రిటర్నింగ్ అదికారులు 43 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎవరైనా పిర్యాదులు సందేహాలు ఉన్నట్లతే కంట్రోల్ రూమ్ పోన్ నెంబర్ 08455276 155,హెల్ప్ డెస్క్ నెంబర్ 8125352721 లలో సంప్రదించవచ్చునని తెలిపారు. కలెక్టర్ వెంట ఎంపిడిఓ శ్రీనివాస్ ,ఎంపి ఓ సుదీర్ తదితరులు ఉన్నారు.

## మహా మేడారం జాతరను సమన్వయంతో విజయవంతం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. 8 క్యూలైన్ల ద్వారా భక్తులకు అమ్మవార్ల దర్శనం కోసం అనుమతించి మూడు గేట్ల ద్వారా బయటికి పంపించడం జరుగుతుందని, జిల్లా పోలీస్ యంత్రాంగం తీసుకునే నిర్ణయాలకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. జాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయబోతున్నామని, ప్రత్యేక నినాదంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా భక్తులకు వివరించడం జరుగుతుందని అన్నారు. జాతర సందర్భంగా ఇతర సమయాలలో పలు రకాల వాహనాలు వేగంగా వెళ్ళకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ములుగు జిల్లాలో గంజాయి అమ్మకాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయబోతున్నామని, చెడు వ్యసనాలపై యువకులకు అవగాహన కలిగించడానికి కళాబృందాలచే అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. అక్రమంగా ఇసుక, ఎర్రమట్టి, ఇతర వస్తువులను అక్రమంగా రవాణా చేస్తు కేసులు నమోదు చేస్తామని, పలు రకాల పశువులు జాతీయ రహదారిపై రాకుండా వాటికి సంబంధించిన యజమానులకు ముందు సమాచారం అందించి వినని పక్షంలో పశువులను గోశాలకు తరలిస్తామని అన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ములుగు జిల్లాలో పలు రకాల పనులు చేయడానికి వచ్చిన సందర్భంలో వారి వివరాలను పూర్తిగా సేకరించాలని, దీనితో పలు సంఘటనలు చోటు చేసుకోకుండా అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మేడారం జాతర సందర్భంగా పాత్రికేయులు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడానికి ఆలోచిస్తామని, జాతర విషయంలో పాత్రికేయులు సహకరించాలని కోరారు. ఎలాంటి సంఘటనలు జరిగిన తన దృష్టికి కానీ ఇతర అధికారులు దృష్టికి కానీ తీసుకురావాలని, ప్రతి విషయాన్ని భూతద్దంలో చూపించకుండా సమస్య పరిష్కారం కోసం పాత్రికేయుల సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు.

## నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల కు సంబంధించి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్‌ల స్వీకరణ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాలు అయిన ఎల్కతుర్తి, దామెర, గోపాల్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయాలలో క్లస్టర్ల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను గురువారం కలెక్టర్ పరిశీలించారు. ఎల్కతుర్తి గ్రామపంచాయతీ కార్యాలయం( క్లస్టర్) నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఎల్కతుర్తి, బావుపేట, ఆరెపల్లి గ్రామాలు, దామెర గ్రామపంచాయతీ కార్యాలయం క్లస్టర్ నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద దామెర, చింతలపల్లి, ఇందిరా నగర్ గ్రామాలు, గోపాల్ పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం నామినేషన్ స్వీకరణ కేంద్రం వద్ద గోపాల్ పూర్, కోతుల నడుమ, శాంతి నగర్, వల్బాపూర్ గ్రామాల సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థుల నుండి నామినేషన్ల స్వీ కరణకు చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద ఎలక్షన్ నోటీస్, ఓటర్ల జాబితా, హెల్ప్ డెస్కను కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అధికారులు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అభ్యర్థులు సమర్పించే నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ఎంసీ సీ నోడల్ ఆఫీసర్ ఆత్మారాం, జడ్పీ సీఈవో రవి, ఎల్కతుర్తి తహసిల్దార్ ప్రసాద్ రావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీఓ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సునీత కోమ్మాలు నాయక్‌ను గెలిపించి గూడూరు ప్రజలు గిఫ్ట్ ఇవ్వాలి

### మానుకోట ఎమ్మెల్యే మురళినాయక్



**ప్రజాపక్షం/గూడూరు:** ఇందిరమ్మ రాజ్యం కోసం నిరంతరం కృషి చేసే కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వాంకుడోత్ సునిత కోమ్మాలునాయక్ ను గెలిపించి గూడూరు గ్రామ ప్రజలు గిఫ్ట్ ఇవ్వాలని మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉమ మురళినాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గూడూరు గ్రామపంచాయతీ నామినేషన్ వేసేందుకు సునిత ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ మండల పరిషత్ కార్యాలయం నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు భారీ ర్యాలీతో బయలుదేరి వెళ్లి భానోత్ శుష్మాకు నామినేషన్ పత్రంఅందజేశారు.ఈకార్యక్రమంలో పాల్గోన్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళినాయక్ మానుకోట కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలు భూక్య ఉమా మురళినాయక్ మాట్లాడుతూ గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని సంక్షేమానికే పట్టం కట్టాలని అన్నారు. సునిత కోమ్మాలునాయక్ గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో ఆపదలో ఉన్నవారికి అండగా ఉన్నారని గుర్తు చేశారు.వారిని దీవించి గెలిపించాలన్నారు. వారి గెలుపుకొరకు కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ సైనికుల వలె పని చేయాలని ఆయన తెలిపారు. .జిల్లా నాయకలు మాదవపెద్ది రమేష్ చందర్‌రెడ్డి మాదవపెద్ది ప్రతీఫ్‌రెడ్డి చిట్టె వెంకన్న బీరం శ్రీపాల్‌రెడ్డి నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్‌రెడ్డి చంటి స్వామి ఓర్పు భాగ్యలక్ష్మి బిక్షపతి యకయ్య ఎండి రసూల్ శివరాత్రి సంపత్ శ్రీనువాస్ పేరాల సురేందర్ మండల శ్రీనువాస్ మహిళలు పాల్గోన్నారు.

## ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**ప్రజాపక్షం/శాయంపేట :** కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలులో జాప్యం చేయవద్దని అధికారులు నిర్వాహకులను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించి ఎన్ని క్వింటాలో దాన్యం ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఎన్ని రోజులు అవుతుంది, ఎంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు, ఈరోజు ఎంత ధాన్యాన్ని కాంటాలు వేశారు, ఎన్ని టోకెన్లు ఇచ్చారు, రోజుకు మిల్లులకు ఎంత ధాన్యం వెళ్తుంది, రైతుల వివరాలను ట్యాబ్ లో ఎందుకు నమోదు చేయడం లేదని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల కోసం టెంట్, తాగునీరు సదుపాయాలు కల్పించాలి కదా ఎందుకు కలిపించలేదని నిర్వాహకులను కలెక్టర్ ప్రశ్నించారు. ఆరు రోజుల నుండి ట్యాబ్ పనిచేయకపోతే ఎందుకు బాగు చేయించలేదని కలెక్టర్ అడిగారు. రైతులకు డబ్బులు ఖాతాలో పడాలంటే ట్యాబ్ ఎంట్రీ చేయాలి. ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇన్ని రోజుల నుండి ట్యాబ్ ఎంట్రీ చేయకపోతే రైతులు ఎందుకు అడగడం లేదని అక్కడే ఉన్న పలువురు రైతులను కలెక్టర్ అడిగారు. అక్కడే ఉన్న రైతుల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు, ట్యాబ్ ఎంట్రీ చేయడంలో జరిగిన నిర్లక్ష్యంపై ఏపీఎం, కొనుగోలు కేంద్రం ఇన్చార్జికి షోకాజ్ నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రైతుల వివరాలను నమోదు చేసే ట్యాబ్ ను వెంటనే బాగు చేయించుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే ఎంట్రీ చేయాలని పేర్కొన్నారు. దాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరిగే విధంగా ఎంపీడీవో, ఏపీఎం కొనుగోలు చేసిన వద్ద ఉండి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద టెంటు, తాగునీరు సౌకర్యాలు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. స్థానిక తహసిల్దార్ ప్రవీన్ కుమార్, ఎంపీడీవో ఫణి చంద్ర, ఏపీఎం వేణు, తదితరులతో పాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## సురభి మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు ర్యాగింగ్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కళాశాల యజమాన్యం సరైన రీతిలో స్పందించకపోవటంతో బాధిత విద్యార్థి తల్లి వీణ సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత విద్యార్థి సమీర్ రాజ్‌కృష్ణ. తల్లి వీణ కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన సమీర్‌రాజ్ కృష్ణ సిద్దిపేట జిల్లా మిట్టపల్లి సురభి మెడికల్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ చదువుతున్నారు. ఈనెల 17న సమీర్‌రాజ్ కృష్ణను లైబ్రరీకి వెళ్లగా జూనియర్ విద్యార్థులు లైబ్రరీకి రావద్దని వారించారు. గడ్డం పెంచుకోవటంతో ఎందుకు గడ్డం పెంచుతున్నావని.. తీసేసుకో చెప్పగా దేవుడికి మొక్కు ఉందని విద్యార్థి సమీర్ కృష్ణ చెప్పారు. వారు బలవంతంగా బాధిత విద్యార్థి సమీర్‌రాజ్ ట్రిమ్మర్‌తో గడ్డం తీయించారు. దీంతో సమీర్‌రాజ్ కృష్ణ వారి తల్లి వీణకు ఫోన్ చేసి చెప్పి సీనియర్లు గడ్డం తీయించారని, మొక్కు బ్రేక్ అయిందని చెప్పారు. దీంతో బాధిత విద్యార్థి తల్లి వీణ కళాశాలలోని యాంటి ర్యాగింగ్ కమిటీకి చెప్పాలని సూచించగా విద్యార్థి సమీర్ రాజ్ కృష్ణ వారికి ఫిర్యాదు చేశారు. ఆనంతరం విచారణ జరిపిన యాంటి ర్యాగింగ్ కమిటీ విద్యార్థులను మందలించి ర్యాగింగ్‌కు పాల్పడిన నల్గురు విద్యార్థులను వారం రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఆనంతరం సీనియర్ విద్యార్థులు యాంటి ర్యాగింగ్ కమిటికి ఎందుకు ఫిర్యాదు చేశావని బెదరించి ర్యాగింగ్‌కు పాల్పడి మెస్ వద్ద దాడిచేసేందుకు యత్నించినట్లు తెలిపారు. మరోసారి సమీర్‌రాజ్ కృష్ణ తన తల్లి వీణకు చెప్పారు. ఈనెల 26న మెడికల్ కళాశాలకు ఉదయం 9 గంటలకు వస్తే సాయంత్రం వరకు వేచి యున్న యాంటి ర్యాగింగ్ కమిటి పట్టించుకోలేదన్నారు. తమకుమారుడి తోటి విద్యార్థులతో ప్రాణ భయం ఉందని చెప్పిన కళాశాల యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. వారు ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులకు మద్దతుగా మాట్లాడరని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థి తల్లి సిద్దిపేట త్రీన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి విచారణ జరిపి ఆనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విద్యాసాగర్ తెలిపారు.

# రాజ్యాంగమే దేశంలో అత్యున్నత చట్టం

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** రాజ్యాంగం దేశంలో అత్యున్నత చట్టమని , పౌరులు రాజ్యాంగానికి కట్టుబడి ఉండి, దాని ఆదర్శాలను కొనసాగించాలని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె. పట్టాభి రామారావు పిలుపునిచ్చారు. నవంబర్ 26న భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ఆధ్వర్యంలో, "కొండూరు సరస్వతి మార్కండేయ (కేఎస్ఎం) ఫౌండేషన్" సహకారంతో, సుబేదారి లోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో మూట్ కోర్ట్, వక్తృత్వం, వ్యాస రచన పోటీలను నిర్వహించింది. ఈ పోటీలకు యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. సుదర్శన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన హనుమకొండ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి డాక్టర్ కె. పట్టాభి రామారావు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాతలు అనేక చట్టాలను, రాజ్యాంగాలను అధ్యయనం చేసి, మన దేశానికి అనుగుణమైన రాజ్యాంగాన్ని రూపొందించా




రని, రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని, రాజ్యాంగ స్ఫూర్తిని ఆదర్శాలను కొనసాగించాలని ప్రసంగించారు. మరో ముఖ్య అతిథి కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను అనుభవించడంతోపాటు ప్రాథమిక విధులను కూడా తప్పనిసరిగా పాటించినప్పుడే రాజ్యాంగ విలువలని కాపాడిన వారమవుతామని చెప్పారు. వక్తృత్వ పోటీలో లింగ న్యాయం, న్యాయపరమైన క్రియాశీలత అనే అంశంపై నిర్వహించిన పోటీలో పి. శ్రుతి మొదటి స్థానంలో, చాందిని రెండవ స్థానంలో, ఆర్. తేజస్వి మూడవ స్థానంలో నిలిచారు. "డిజిటల్ యుగంలో భారతదేశంలో గోప్యతా హక్కు" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో తౌరయ్య రాయన్ మొదటి స్థానంలో, పి. శ్రుతి రెండవ స్థానంలో, వి. శ్రీవల్లి ఆండాళ్ మూడవ స్థానంలో నిలిచారు. వి. చందనకు కన్సోలేషన్ బహుమతులు లభించాయి. అదేవిధంగా మూట్ కోర్ట్ పోటీలో 13 జట్లు పాల్గొనగా, మొదటి బహుమతిని ఆదర్శ లా కాలేజీకి చెందిన ఎ. సుధీర్, ఎం. సతీష్, బి. రంజిత్ లకు లభించింది. రెండవ స్థానంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా కళాశాలకు చెందిన ఎన్. శివ, బి. కావ్య, జైనాబ్ ఫాతిమా, మూడవ స్థానంలో వి. శ్రీవల్లి ఆండాళ్, పి. శ్రుతి, బి. వర్ష విజేతలలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ బారసోసియేషన్ మాజీ అధ్యక్షులు, కే ఎస్ఎం వ్యవస్థాపకులు కేపీ ఈశ్వర్ నాథ్, యూనివర్సిటీ అకడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోల శంకర్, న్యాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ టి.సి. సుజాత, డాక్టర్ ఎస్. పద్మజ, కె. హరి ప్రసాద్, డాక్టర్ వై. ప్రభాకర్, డాక్టర్ జి. వేదశ్రీ, డాక్టర్ ఆర్. లక్ష్మణ్, డాక్టర్ చల్లా శ్రీనివాస్, డాక్టర్ మధు, బోధనేతర సిబ్బంది, విశ్వవిద్యాలయ న్యాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎనీమియా ముక్త భారత్



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు మండలంలోని బండారుపల్లి గ్రామంలో గల పిఎం శ్రీ తెలంగాణ మాడల్ స్కూల్లో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతాన్ని నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె స్కీమ్‌కు చెందిన వైద్యులు డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ మధుప్రియ, సుభాషిణి, ఏఎన్ఎం అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రక్తహీనత గల విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. వారి ఆహారంలో తరచూ ఆకు కూరలు, ప్రోటీన్లు, విటమిన్లు ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సింగారం దేవకి మాట్లాడుతూ విద్యార్థులందరూ వైద్యులు చెప్పిన సలహాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌బిఎస్‌కె వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రమాదం పొంచి ఉన్న పట్టించుకోరా?

భయం గుప్పిట్లో ప్రయాణం

**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** ఎండిపోయిన చెట్టు ఎప్పుడు విరిగి తమపై పడి పెద్ద ప్రమాదం పొంచి ఉన్న కూడా గ్రామాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. మండలంలోని గుర్రేవుల ఎస్సి కాలనీ ఎనిమిదవ వార్డు సిసి రోడ్డు దారి పైన తునికి చెట్టు పూర్తిగా ఎండిపోయి కూలే దశకు చేరుకుంది. ఇది దారికి పక్కనే ఉండడంతో ఈ దారితో ప్రయాణించే వాహనదారులు, చిన్నపిల్లలు ఎప్పుడు ఈ చెట్టు విరిగిపడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన అధికారులు వెంటనే స్పందించి తునికి చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలలో బిసి సత్తా చాటాలి



**ప్రజా పక్షం/హనుమకొండ టౌన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలలో బిసిలు సత్తా చాటాలని తెలంగాణ రాజ్యాధికారి పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటేశ్వర్లు అన్నారు.పార్టీ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు హన్మకొండ టిఆర్పి జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటేశ్వర్లు హరిత హోటల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.స్థానిక సంస్థలలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం ఇవ్వడం జరిగిందని, వాగ్దానాన్ని నెరవేర్చకుండా అసెంబ్లీలో బీసీల కోసం ఆర్డినెన్స్ జీవో ఇచ్చి కాలయాపన చేసుకుంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి బీసీలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 42 శాతం రిజర్వేషన్ సాధ్యం కాదని తెలిసిన కూడా కాలయాపన చేస్తూ పార్లమెంట్లో బిల్లు సవరణ చేసి 42 శాతాన్ని బిల్లును ఆమోదించాలి కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ప్రజలను మోసం చేస్తూ స్థానిక సంస్థల్లో 23 శాతం బదులు 17 శాతం తోనే బీసీ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. దొంగ హామీలు ఇచ్చినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు కలిసి పోరాడాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనార్టీల, కలిసి పోరాడుతేనే రాజ్యాధికారం సాధించుకోవచని అన్నారు. జనరల్ స్థానాల్లో కూడా బీసీ నాయకులు, టిఆర్పి నాయకులు ఎన్నికలో పోటీ చేయాలని, రెడ్లు, రావులు, అగ్రవర్ణ కులాలను ఎన్నికల్లో ఓడించి అత్యధిక మెజారిటీతో బిసి బిడ్డను గెలిపించుకొని బిసిల సత్తా చాటుతామన్నారు.ఈ సమావేశంలో జిల్లా నాయకులు, పూజారి సత్యనారాయణ,దొడ్ల శేఖర్ పటేల్,కొమ్మినేని శరత్ పటేల్,బాల్నే లక్ష్మి జిల్లా మహిళా ప్రెసిడెంట్, మాధవి, బాల్నే జగన్ మోహన్, భగ్గి రాజు ఎండి మసూద్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ నుండి బిజెపిలో చేరికలు



**ప్రజాపక్షం/దామెర :** పరకాల నియోజకవర్గం దామెర మండలం పసరగొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు యూత్ అధ్యక్షులు బండారి రాజేష్, బండారి నరేష్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మంద రాజు (బుచ్చి కొండయ్య) మేడిపల్లి బాబు, పసరగొండ గ్రామ బిజెపి నాయకులు కొట్టే రమేష్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీలోకి చేరడం జరిగింది. వారికి బిజెపి రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి పగడాల కాళీ ప్రసాద్ రావు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దామర మండల అధ్యక్షులు వేల్పుల రాజకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరామ్ రెడ్డి మాజీ సర్పంచ్ మంద రమేష్, మాజీ మండల్ అధ్యక్షులు జంగిలి నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శులు సూర చందర్, గండు ముఖేష్, పరుశరామ్, గోగుల సమ్మి రెడ్డి, బీజేవైఎం నాయకులు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, బూత్ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**భానోత్ పుల్యా కుటుంబ సభ్యులకు పరామర్శ**

పరకాల నియోజకవర్గం సంగెం మండలంలోని రేఖ్యా నాయక్ తండాలో ఇటీవల మరణించిన భానోత్ పుల్యా కుటుంబ సభ్యులను బిజెపి పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద రావు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సంగెం మండల పార్టీ అధ్యక్షులు దామెరుప్పుల చంద్రమౌళి, గీసుకొండ మండల పార్టీ అధ్యక్షులు కొంగర రవికుమార్, మాజీ మండల అధ్యక్షులు బుట్టి కుమారస్వామి, ఆత్మకూరు మండల్ బీజేవైఎం అధ్యక్షులు పోరెడ్డి ప్రదీప్ రెడ్డి, బానోతు రాజు,భూక్య రాజ్ కుమార్, ప్రదీప్, భూక్య మల్లేష్, సతీష్, మండల కార్యదర్శి దాసరి కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్

### జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/ములుగు:** 2న సాధారణ పంచాయతీ ఎన్నికలు... 2025 నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం మొదటి విడత ఎన్నికలలో 48 సర్పంచ్, 420 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, ఎంసిఎంసి, ఎంసిసి, ఇతర ఎన్నికల సంబంధిత పర్యవేక్షణ బృందాలను, ఎన్నికల అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలను ప్రలోభ పెట్టే నగదు, మద్యం, కానుకల పంపిణీ, ప్రచారం, అక్రమ నగదు రవాణా, ఇతర ప్రభావిత అంశాలపై నిఘా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అంశాలు ఎవరి దృష్టిలోకైనా వచ్చినట్లయితే కంట్రోల్ రూ నంబర్ 18004257109లో ఫిర్యాదు చేయవచ్చని, ఇతర ఎన్నికల సంబంధిత సమాచారం కోసం సంప్రదించవచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జీవనశైలిలో మార్పుతో అదుపులో మధుమేహం

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : తీసుకునే ఆహారం మరియు జీవనశైలిలో మార్పుల ద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చని సాయిబాబా మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ అన్నారు. గురువారం మందిర ప్రాంగణంలో డయాబెటిస్ సెంటర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మధుమేహ వ్యాధి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సిబ్బంది వైష్ణవి, శివ, భాను, చిట్టి బాబు భక్తులకు రక్త పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం వ్యాయామం ద్వారా షుగర్ వ్యాధి అదుపులో ఉంచుకొని ఆరోగ్యంగా ఉండవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో సాయికృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త విత్తన బిల్లు 2005పై అభిప్రాయ సేకరణ

**ప్రజాపక్షం/ములుగు:** రైతులు, విత్తన వ్యాపారులు, ఉత్పత్తిదారులు, నర్సరీల యజమానులు, ఇతర వాటాదారుల నుండి కొత్త విత్తన బిల్లు 2025 ముసాయిదాపై అభిప్రాయాలను సేకరించడం జరిగిందని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ కొత్త విత్తన బిల్లు..2025 ముసాయిదాపై జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశం, విస్తృత సేకరణ ములుగు జిల్లాలో రైతులు, విత్తన డీలర్లు, విత్తన ఉత్పిత్తిదారులు, అన్ని సంబంధిత వర్గాలతో సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త విత్తన బిల్లు..2025లోని సెక్షన్లు, క్లాసులు, విత్తన చట్టం 1966లోని లోపాలు, కొత్త విత్తన చట్టం 2025లోని లక్ష్యాలు ప్రతి అంశంపై కూలంకషంగా చర్చించారు. . ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి సురేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఏ టూరునాగారం అవినాష్ వర్మ, జిల్లాలోని అన్ని మండలాల మండల వ్యవసాయాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ నియంత్రణకు పురుషులు ముందుండాలి

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడంలో పురుషులు ముందు ఉండాలని హనుమకొండ జిల్లా డిఎంహెచ్ ఓ డాక్టర్ ఏ అప్పయ్య సూచించారు. వ్యాసెక్టమీ పక్షోత్సవాలలో భాగంగా నవంబర్ 21 నుండి డిసెంబర్ 4 వరకు పురుషులకు కోత కుట్టు లేని ఎన్ ఎస్ వి ఆపరేషన్ పట్ల అవగాహన కలిగించడంతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.మండల పరిధిలోని ఉన్నతశ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఎన్ఎస్ వి సర్జన్ డాక్టర్ కృష్ణారావు 21మంది పురుషులకు వ్యాసక్టమీ ఆపరేషన్ చేసినట్లు తెలియజేశారు.అలాగే తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన అంతర ఇంజక్షన్ ,కాపర్టీ ,నోటి మాత్రలు నిరోద్ గురించి కూడా అర్హులైన దంపతులకు అవగాహన కలిగిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల, డాక్టర్ స్టాటిస్టికల్ అధికారి జీ. ప్రసన్నకుమార్ హెల్త్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, ఇంద్రారెడ్డి, మోసిన్, సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# 20 స్థానాల్లో బరిలో ఎంసిపిఐ(యు) అభ్యర్థులు

### వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** కలిసివచ్చే కమ్యూనిస్టు , వామపక్ష పార్టీలతో కలిసి స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలని పార్టీ నిర్ణయించినట్లు ఎంసిపిఐ(యు )వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ వెల్లడించారు . నర్సంపేట డివిజన్ కమిటీ సమావేశం నర్సంపేట లోని ఓంకార్ భవన్ లో కొత్తకొండ రాజమౌళి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో డివిజన్‌లోని 20 స్థానాలలో ఎంసిపిఐ(యు) పార్టీ అభ్యర్థులు బరిలో నిలవనున్నారని తెలిపారు. మొదటి నుండి కూడా ఎంసిపిఐ (యు) పార్టీ దోపిడి పాలకవర్గాలకు వ్యతిరేకంగా కలిసివచ్చే సామాజిక వామపక్ష శక్తులతో కలిసి పనిచేస్తుందని, ఇప్పుడు కూడా వామపక్షాల ఐక్యతకే మొదటి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఎన్నికల్లో ప్రజల పక్షాన నిలిచే ఎంసిపిఐ(యు) పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కపట నాటకం ఆడుతూ ప్రజలను మోసం చేసిందని, స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన నిలిచిన కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను ప్రజలు గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, నాగెల్లి కొమురయ్య , కుసుంబ బాపురావు , వంగల రాగసుధ, ఏఐసిటియూ జిల్లా కోశాధికారి ఎండి మాషూక్, బత్తిని కుమారస్వామి, కలకోట్ల యాదగిరి, సురేందర్, జన్ను రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంబా ఆరాట్ మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వానం

**ప్రజాపక్షం/నర్సంపేట:** శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి 25 ( పంచవి శతి) మండల పూజ మహోత్సవ ఆహ్వానం రజతోత్సవ సిల్వర్ జూబ్లీ వేడుకలలో భాగంగా పంబా ఆరాట్ మహోత్సవ కార్యక్రమానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి సేవ చారిటబుల్ ట్రస్ అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ బాధ్యులు గురువారం ఆహ్వానించా రు. నల్లబెల్లి మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి స్వగ్రహంలో క మిటీ బాధ్యులు కలిసి డిసెంబర్ 9న జరిగే పంబా ఆరాట్ మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అయ్యప్ప స్వామి భక్తునిగా గత 25 సంవత్సరాలు (సిల్వర్ జూబ్లీ)గా పంబా ఆరాట్ మహా అన్నదాన ( పంబా సద్ది) కార్యక్రమానికి దాతగా పెద్ది సుదర్శన్ రెడ్డి వ్యవహరించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ బాధ్యులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## డిఇని కలిసిన విద్యుత్ ఉద్యోగులు

**ప్రజాపక్షం/రాయపర్తి:** వరంగల్ జిల్లా విద్యుత్ డీఈగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన దానయ్యను గురువారం విద్యుత్ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొల్లం రావిష్, కార్యదర్శి జెట్టి సురేందర్, డివిజన్ ప్రెసిడెంట్ వెంకన్న, దామోదర్, శ్రీనివాస్, కృష్ణ, శ్రీరాములు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు నెలకు రూ.2500ల హామీ ఏమైంది

**ప్రజాపక్షం/నర్సంపేట:** మహిళలకు నెలకు రూ.2500ల హామీ ఏమైందని నర్సంపేట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జీ నామాల సత్యనారాయణ ప్రశ్నించారు. నర్సంపేట మండలంలోని పాత ముగ్ధుంపురం గ్రామంలో కార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో మహిళలకు నెలకు రూ,2500/ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని, అదేవిధంగా ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం ఇస్తామని చెప్పి ఆడబిడ్డలకు మోసం చేసిందని, చదువుకున్న అమ్మాయిలకు స్కూటీలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి ఆడబిడ్డలను మోసం చేశాడని విమర్శించారు.

# బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ బిసిలను మోసం చేశాయి

### తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్



**ప్రజాపక్షం/ నర్సంపేట :** కేంద్ర లో బిజెపి రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఈ మూడు పార్టీలు బిసిలను దారుణంగా మోసం చేశాయని తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట పట్టణంలోని తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి బిల్లు పెట్టి శాసనమండలిలో బిల్లు పెట్టి ఆమోదింపజేసిన బిసి బిల్లును గవర్నర్‌కు పంపడం జరిగిందన్నారు. ఆ బిల్లును కేంద్రం కుట్రతో ఆపిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చామని చెప్పి చివరకు గవర్నర్ మీద, కేంద్రం మీద, కోర్టు మీద నిందలు వేసి తప్పించుకుంటుందన్నారు. గతంలో కంటే కూడా తక్కువ రిజర్వేషన్ ఇచ్చి బిసిలకు మోసం చేస్తుందన్నారు. కావున పార్టీలకు అతీతంగా బీసీ నాయకులంతా ఇప్పటికైనా ఏకం కావాలని, బిసి సంఘాలు అన్ని ఏకమై రాజకీయ పార్టీలను శాసిస్తున్న అగ్రకులాల నాయకుల భరతం పట్టాలని అన్నారు. జనాభా ధమాషా ప్రకారం రిజర్వేషన్ సాధించుకోవాలని, బిజెపి టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు నమ్మడానికి వీలు లేదని, పార్టీలు గతంలో కూడా బిసిలకు మోసం చేశాయని, మోసం చేస్తున్నాయి కాబట్టి పార్టీలకతీతంగా జెండాలను పక్కన పెట్టి మనకోసం మన జాతి కోసం భవిష్యత్తు తరాల కోసం ఇప్పటికైనా బిసిలందరూ ఏకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు షేక్ జావిద్, రాష్ట్ర నాయకులు బోనగాని రవీందర్, గుంటి రామచందర్, డివిజన్ నాయకులు సాయికుమార్, గుంటి సంజీవ, మహమ్మద్ సంధాని, తదితరులు పాల్గొన్నారు

# బ్రాందీ షాపుల తంతు...ప్రజలు అయోమయం!




**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండలో మద్యం షాపుల టెండర్ల కథనం ఇప్పుడు కల్తీ పేర్ల డ్రామాగా మారింది. నవంబర్ 30తో పాత షాపుల టెండర్ ముగియనుంది. డిసెంబర్ 1 నుండి టెండర్లు దక్కించుకున్న కొత్త వారికి అధికారం ఇవ్వాలని ఎక్సైజ్ శాఖ తీర్మాణించింది. అంతా బాగానే ఉంది...కానీ నెక్కొండలో అయితే షాపుల పేర్లు చూస్తే హాస్యం ఆపుకోలేని పరిస్థితి! పాత షాపు అవకముందే, కొత్త షాపు పేర్ల బ్యానర్లు అక్కడే ఎగిరిపోతూ..ప్రజలను ఒకసారి మద్యం సేవించక ముందే దిమ్మదిరిగిపోయే పరిస్థితి గందరగోళంలో పడేశాయి. అసలు ఏది పాతదో? ఏది కొత్తదో? ఏది షాపు? ఏది విజయవంతుల షాపు? అనేది ప్రజలకు క్లారిటీ లేకుండా పోయింది. లైసెన్స్ నంబర్లు చూసేంత సబ్జెక్ట్ తెలిసిన వారైతే అలా అర్థం చేసుకుంటున్నారు. కానీ సాధారణ ప్రజలకు ఇది పూర్తిగా తొందరపడి కోయిల ముందే కూసింది అన్న పాటకు నిర్వచనం. పాత షాపు మూసేలోపే కొత్త షాపు బోర్డు కట్టేసిన కొత్త బ్రాండ్ షాపుల యజమానుల విధానం చూసి ప్రజలు నవ్వుకోవాలా..లేక ఏడవాలా అన్న సందిగ్ధంలో పడిపోయారు. షాపు పేర్లు ఒకటిగా, బోర్డులు వేరుగా, లైసెన్స్ మరో షాపుకు..అంటే ఎక్సైజ్ శాఖే డబుల్ రోల్ ప్లే చేసినట్లుగా ఉంది. నెక్కొండలో మద్యం షాపుల విషయమే ఇలా ఉంటే, రాష్ట్రంలో మిగతా ప్రాంతాల్లో ఇంకా ఏ కలర్ ప్లే జరుగుతుందో ప్రజలు, అభ్యుదయవాదులు ప్రశ్నిస్తోంది!

# కేంద్ర నిధులతోనే గ్రామల అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/ నర్సంపేట (నల్లబెల్లి):** కేంద్ర నిధులతోనే గ్రామ అభివృద్ధి సాధ్యంమని బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలం ఆసరవెల్లి గ్రామ బిఆర్ఎస్ గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు గుండబోయిన తిరుపతి బిజెపి మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ అధ్యక్షతన భారతీయ జనతా పార్టీగురువారం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయనకు బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బిజెపి పార్టీ నిధులతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమని గ్రహించి బిజెపి పార్టీలో చేరుతున్నారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాభివృద్ధి సాధ్యమైతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు సింగిరెడ్డి యాదగిరి, మండల నాయకులు ఊటుకూరి చిరంజీవి గౌడ్, ఆసరవెల్లి గ్రామ పార్టీ నాయకులు హుసేన్, కిషన్, సుమన్, వీరన్న, స్వామి, రాజకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# నెక్కొండలో దొంగల బీభత్సం

### ప్రముఖుల ఇళ్లలో దొంగతనాలు, ప్రజల్లో ఆందోళన

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ పట్టణం మరోసారి దొంగల బీభత్సంతో దుశ్శాంత స్థితిని ఎదుర్కొంటుంది. పట్టణ కేంద్రంలోని గుండ్రపల్లి రోడ్డుపై వరుసగా మూడు ఇళ్లలో చోరీలు చోటు చేసుకోవడం ప్రజల్లో తీవ్ర ఆందోళనలకు దారి తీసింది. ప్రముఖ రాజకీయ నేతలైన సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కాసు అరుణమ్మ, గుంటూరు వరలక్ష్మి ల ఇళ్లలో అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి విలులైన వస్తువులను ఆపహరించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే పట్టణంలో ఇంత కీలక ప్రాంతంలో వరుస చోరీలు జరగడం పోలీసుల గస్తీ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఇటీవల రోజులుగా పట్టణంలో అనుమానాస్పదన వ్యక్తుల సంచారం పెరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోలీసులు రాత్రి పహారా చేయాలని, ప్రత్యేకంగా గుండ్రపల్లి రోడ్డు, పట్టణ బైపాస్ ప్రాంతాల్లో అదనపు గస్తీ అవసరమని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను వెంటనే పరిశీలించి దర్యాప్తులను వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. నెక్కొండ వంటి అభివృద్ధి చెందుతున్న పట్టణంలో వరుస చోరీలు జరుగుతుండడం ఆందోళనకరమని, రాత్రివేళ ఇళ్లకు తాళాలు వేసేటప్పుడు అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, సిసి కెమెరాలు, అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. నెక్కొండలో జరుగుతున్న ఈ దొంగతనాల పరంపరను అరికట్టేందుకు పోలీసులు తక్షణ చర్యలు చేపట్టిన ప్రజలకు భద్రత కల్పించాలన్నది ప్రజల అభిలాష.

## నిబంధనలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఎలాంటి నిబంధనలు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని మాజీ ఎంపిపి వేములపల్లి ప్రకాష్ రావు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. గురువారం కొనుగోలు కేంద్రంలోని వరిధాన్యాన్ని వారు పరిశీలించి అనంతరం మాట్లాడుతూ ఇప్పటివరకు కొనుగోలు ప్రారంభించకుండా మిల్లర్లకు వత్తాసు పలికేందుకు కాంటాలను ఆలస్యం చేస్తున్నారని, ఎప్పుడు వర్షాలు, తుఫాన్లు వచ్చేటట్లున్న రైతులను 15 నుండి 20 రోజులు మార్కెట్‌లో పడిగాపులు కాస్తూ బిక్కుబిక్కుమంటూ కొనుగోలుకై ఎదురుచూస్తున్న రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతుల కొరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి వెంకట నర్సయ్య, గుగులోతు లక్ష్మణ్ నాయక్, ఖానాపూర్ బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చిక అశోక్ గౌడ్, బోడ పూలు నాయక్, కాంగ్రెస్ నాయకులు, ఖానాపూర్ మాజీ వార్డు మెంబర్ కందుల సాంబయ్య, కాంగ్రెస్ నాయకులు జటంగి కుమార్ యాదవ్, నూనెల కుమార్ యాదవ్, మర్రి రామస్వామి, ముద్దంగుల రవి, వెంకన్న, రమేష్, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ఇందిరా శక్తి చీరల పంపిణీ

**ప్రజాపక్షం/నెక్కొండ:** తెలంగాన స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో అమల్లోకి వచ్చిన ఎన్నికల నియమావళి ప్రభావం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. అధికారుల ఆదేశాలమేరకు మహిళా సంఘాలు చేపట్టిన ఇందిరా శక్తి ఉచిత చీరల పంపిణీ ఒక్కసారిగా నిలిచిపోవడంతో అనేక చోట్ల మహిళలు ఆందోళనలో ఉన్నారు. కొన్ని గ్రామాల్లో కేవలం 50 శాతం మాత్రమే, మరికొన్ని చోట్ల దాని కంటే తక్కువగా పంపిణీ ముగిసినట్లు సంఘాలు వెల్లడిస్తున్నాయి. ప్రతి మహిళకు ఐరిస్ ధృవీకరణ విధానం అమలులో ఉండడమే ఆలస్యానికి కారణమైందని అధికారుల, సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. పంపిణీ ప్రక్రియలో పూర్తి స్థాయి పారదర్శకత ఉండాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం ఉన్నా, ఎన్నికల కోడ్ మధ్యలో రావడంతో వందలాది మహిళలు తమ చీరల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఏర్పడింది. కొందరు ఇతర ప్రాంతాల్లో బతుకుదెరువు కోసం, ఉద్యోగరీత్యా, చదువుల కోసం వెళ్ళిన వారు ఉన్నారు. ప్రజలకు మేలు చేసే పథకాలు అలాగే ఆగిపోకుండా, ఎన్నికల అనంతరం వెంటనే పంపిణీ పునః ప్రారంభమయ్యేలా అధికారులు ఆదేశించినట్లు మహిళా సంఘాలు చెబుతున్నాయి.

## నామినేషన్ల ప్రక్రియలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు




ప్రజాపక్షం/ గుమ్మడిదల :గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గుమ్మడిదల మండల పరిధిలోని పలు గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ వార్డు సభ్యుల ఎంపిక కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులు మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్ కలసి పాల్గొన్నారు. పార్టీ అభ్యర్థుల తుది ఎంపిక ప్రక్రియలో భాగంగా నాయకులు గ్రామ స్థాయి కార్యకర్తలు పెద్దలతో సమావేశం జరిపి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం కొన్ని గ్రామాల బీఆర్ఎస్ అభ్యర్థుల సర్పంచ్ నామినేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి ప్రజా సంక్షేమమే తమ పార్టీ లక్ష్యమని ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఘన విజయం సాదించేలా చేయాలని నాయకులు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు . గ్రామాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థులు కట్టుబడి ఉన్నారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్, గణేష్ అప్ప, సాయిభరత్,రామకృష్ణ తుపాకుల రాజు , కరుణాకర్ రెడ్డి,సత్తయ్య, శేఖర్, గౌడ్, లక్ష్మణ్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాపక్షం/గజ్వేల్:గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ హైమావతి పేర్కొన్నారు. గురువారం అక్కారం, గొల్లపల్లి, జగదేవ్ పూర్ క్లస్టర్లలో నామినేషన్ ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం గ్రామపంచాయతీ ఎన్నికలకు ఈనెల 25 సాయంత్రం షెడ్యూల్ విడుదల చేయగా, సిద్దిపేట జిల్లాలో 3 విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో దౌల్తాబాద్, రాయపోల్, మార్కుక్, ములుగు, గజ్వేల్, జగదేవ్ పూర్, వర్గల్ మండలాలలో 163 గ్రామ పంచాయతీలు 1432 వార్డులకు 44 క్లస్టర్ లలో నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. స్టేజి 1, స్టేజి 2 అధికారులకు శిక్షణ ఇచ్చి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉదయం10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు తీసుకుంటుండగా, నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతి ఇస్తూ 3రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. నామినేషన్ ప్రక్రియకు ఆయా మండల ఎంపిడిఓలు అప్రమత్తంగా ఉండాలని, ఆయా క్లస్టర్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతిదీ క్లుప్తంగా తనిఖీ చేశాకే స్లిప్ అందజేయాలని, స్టేజ్ 1, 2 అర్ఓలను ఆదేశించారు. క్లస్టర్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో మార్కింగ్ చేసి ముగ్గురిని మాత్రమే నామినేషన్ కేంద్రం లోకి అనుమతించాలని, క్లస్టర్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు గట్టి బందోబస్తు నిర్వహించాలని వివరించారు.

## మెదక్ జిల్లాలో మొదటి రోజు 59 నామినేషన్లు దాఖలు

ప్రజాపక్షం/మెదక్:గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లాలో మొదటి విడతలో ఆరు మండలాలలో జరుగు సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.మెదక్ జిల్లాలో తొలి దశలో అల్లాదుర్గం, రేగోడు, పాపన్నపేట్, హవేలి ఘన్పూర్, శంకరంపేట (ఆర్) ఆరు మండలాల్లోని 160 గ్రామ పంచాయతీలు,1402 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి.జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు 59 నామినేషన్లను అభ్యర్థులు దాఖలు చేశారు. సర్పంచ్ స్థానాలకు 55 నామినేషన్లు, వార్డు స్థానాలకు 4 నామినేషన్ పత్రాలను అభ్యర్థులు దాఖలు చేశారు. అల్లాదుర్గం మండలంలో 06, రేగోడు 07, పాపన్నపేట 13, 05, హవేలీ ఘన్పూర్ 16, పెద్ద శంకరంపేట్ (ఆర్) మండలాల్లో 08 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణను ఈ నెల 27వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి 29వ తేదీ సాయంత్రం 5 గంటల




వరకు సమయం ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ నిర్ణీత సమయంలో నామినేషన్లు దాఖలు చేసేందుకు అన్ని రిటర్నింగ్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రక్రియ పర్యవేక్షణకు నోడల్ అధికారులు, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టీ, ఎంసిసి టీములు పటిష్ట పర్యవేక్షణ చేయాలని, ఎన్నికలు నిర్వహణలో ప్రజలు యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. ఏదేని ఫిర్యాదులు కు 24 గంటలు పని చేయు విధంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము 9391942254 నంబర్ కు కాల్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

## వివాహిత అదృశ్యం

ప్రజాపక్షం/రామాయంపేట:వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన గీతాదేవి (46) మరికొంత మందితో కలిసి దామరచెరువు గ్రామంలోని శ్రీనివాస పౌల్ట్రీలో పని కోసం గత 15 రోజుల క్రితం వచ్చారని తెలిపారు. ఈనెల 24న మద్యాహ్న సమయంలో ఎవరికి చెప్పకుండా పని ప్రదేశం నుండి బయటికి వెళ్లి తిరిగిరాకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఎటువంటి ఆదారాలు లబించలేదని గీతాదేవి బందువు సంజయ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. ఇంటినుండి వెళ్లేటప్పుడు ఎరుపు రంగు చీర, ఎరుపురంగు జాకెట్ ధరించారని ఎత్తు 5.1 అడుగులు నల్లరంగులో ఉంటుందని పిర్యాదులో పేర్కొన్నారు.

## ప్రమాదవశాత్తు నీట మునిగి కార్మికుడు మృతి

ప్రజాపక్షం/రామాయంపేట: ప్రమాదవశాత్తు నీట మునిగి కార్మికుడు మృతిచెందిన సంఘటన గురువారం పట్టణంలోని కొత్తచెరువులో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం బాగిర్తీపల్లి గ్రామానికి చెందిన కోటిడి గట్టయ్య (59) ఈనెల 24న కూలి పనికోసం రామాయంపేటకు వచ్చి ఇంటికి తిరిగి రాలేదు. మృతుని బందువులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ అయిందని బందువుల వద్ద వెతికినా ఎక్కడా ఆదారాలు లబించలేదు. గురువారం పట్టణంలోని కొత్తచెరువులో శవం ఉందన్న విషయం తెలియడంతో మృతుని కుమారుడు అనిల్ చనిపోయింది మా నాన్నే అని గుర్తించా డు. ప్రమాదవశాత్తునీట మునిగి చనిపోయాడని అనిల్ ఇచ్చినఫిర్యాదు మేరకుకేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్ నేత

ప్రజాపక్షం/రామాయంపేట:బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపిపి ముస్కుల స్రవంతి భర్త సిద్దరాంరెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి హైద్రాబాద్‌లో మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రేస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్బంగా సిద్దరాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రేస్ పార్టీ పటిష్టతకు ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావులతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ బిఆర్ఎస్ నుండి కాంగ్రేస్‌లోకి వలసలు పెరిగాయి. గత రెండు రోజుల క్రితం అక్కన్నపేట గ్రామానికి చెందిన కొంతమంది బిఆర్ఎస్ యువకులు కాంగ్రేస్ చేరారు.

## జిల్లాకు విచ్చేసిన సాధారణ ,వ్యయ పరిశీలకులు



ప్రజాపక్షం/ సంగారెడ్డి :జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణను నిష్పాక్షికంగా ,పారదర్శకంగాశాంతి యుతంగా జరపడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇద్దరు అధికారులను ,పరిశీలకులుగా నియమించింది. జిల్లాకు పంచాయతీ ఎన్నికల సాదారణ పరిశీలకులుగా ఐఎఎస్ అదికారి పి ఉదయ్ కుమారు వ్యయ పరిశీలకులుగా, జిల్లా ఆడిట్ ఆపీసర్ జి. రాకేష్ లను నియమించింది. ఎన్నికల ప్రక్రియలో సాదారణ పర్యవేక్షణ అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ వంటి అంశాలను పరిశీలకులు పి ఉదయ్ కుమార్ ఐఏఎస్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో కలిసి కంది మండలం కవలంపేట గ్రామంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నామినేషన్లను పరిశీలించారు. ఎన్నికల నిబందనల మేరకు నడుచుకోవాలని వారు సూచించారు. కలెక్టర్ వెంట ఎంపిడిఓ శ్రీనివాస్ ,ఎంపి ఓ సుదీర్ తదితరులున్నారు. వ్యయ పరిశీలకులు జి.రాకేష్ సంబందిత అదికారులతో సమావేశమై ఎన్నికలలో అభ్యర్థులు ఖర్చు చేసి ప్రతి పైసా నిఘా ఉంచాలన్నారు. నిబందనల మేరకు పారదర్శకంగా నడుచుకోవాలని ఆదేశించారు.

## పదవ తరగతి ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



ప్రజాపక్షం/ కంది: కంది మండలం చేర్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్బంగా తరగతి గదులో జరుగుతున్న భోదనా పద్దతులను పరిశీలించి విద్యార్థులో నేరుగా మాట్లాడారు. విద్యార్థులను సిలబస్ ఎంతవరకు పూర్తయింది. రెగ్యులర్ ప్రత్యేక తరగతులు ఏలా జరుగుతున్నాయి. అని విషయాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులు బాగా నిర్వహిస్తున్నారని చక్కగా చదువు కుంటున్నట్లు విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థులందరికి ప్రతిరోజు స్నాక్స్ అందుతున్నాయా మిడే మీల్స్ నాణ్యత ఎలా ఉంది అనే విషయాలపై ఉపాద్యాయులను కలెక్టర్ ఆరా తీసారు. పాఠశాల హాజరు శాతం పదవ తరగతి విద్యార్థుల ప్రిపరేషన్ ,మక్ టెస్టులు, ఎంత వరకు నిర్వహిస్తున్నారన్న అంశాలను ప్రత్యేకంగా సమీక్షించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు మరింత క్రమశిక్షణతో చదువు కోవాలని కలెక్టర్ సూచించారు. ఈసారి మంచి మార్కులు సాదించి పాఠశాల పేరును జిల్లా పేరును ఉన్నతంగా నిలబెట్టాలని అన్నారు. ఉపాద్యాయులు విద్యార్థులపై మరింత ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన ఆకడమిక్ సపోర్ట్ అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట విద్యాశాఖ అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## జగదేవ్‌పూర్‌లో ప్రారంభమైన నామినేషన్ల పక్రియ

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండలంలో సర్పంచ్ ఎన్నికల కోసం నామినేషన్ల పక్రియ ప్రారంభమైంది. గురువారం సర్పంచ్ అభ్యర్థులుగా ఆయా పార్టీ మద్దతుతో నామినేషన్‌లు దాఖలు చేశారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌తో పాటు లింగారెడ్డిపల్లిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కొంపల్లి కరుణాకర్, చిక్కుడు సుధాకర్‌లు నామినేషన్లను దాఖలు చేశారు. అలాగే గొల్లపల్లిలో స్వతంత్ర అభ్యర్థిగా తిగుళ్ల యాదగిరి నామినేషన్ దాఖలు చేశారు. కాగా మాందాపూర్, వెంకటాపూర్ (బిజి), అనంతసాగర్, కొండపూర్ గ్రామాలలో వేలం పాట ద్వారా సర్పంచ్ అభ్యర్థులను గ్రామస్థులు ఎన్నుకున్నారు.

# రైతులు అధికారుల సూచనలు పాటిస్తే లాభాలు పొందవచ్చు

ప్రజాపక్షం/ గుమ్మడిదల :రైతన్నలు భాగుంటే దేశం బాగుంటుందని ,అదికారులు చెప్పిన సూచనలు పాటించక రైతులు లాభాలను కోల్పోతున్నారని మండల వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సందర్శించి వ్యవసాయంలో ప్రస్తుత కూలీల కొరత ఉండడంతో యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరి కోతలకు హర్వేస్టర్లను వినియోగిస్తుండడంతో గడ్డి వినియోగం తగ్గిపోతుంది . పశు సంపద ఉన్నవారు గడ్డిని సేకరిస్తుండగా మిగతావారు అలాగే పొలంలో వదిలేస్తున్నారు. రైతుల అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూమిలోని అవశేషాలు,ఖనిజజలవణాలు నశించి భూసారానికి ముప్పు పొంచి ఉంటుందని తెలిపారు.

**" కాల్చడం వల్ల కలిగే నష్టాలు "**

వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. విపరీతమైన వేడితో భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా నత్రజని , ఫాస్పరస్ లాంటి ఫోషక పదార్థాతల శాతం దిగుబడి తగ్గిపోతుంది. భూమికి పీచు పదార్థంగ ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటాయి. మేలు చేసే సూక్ష్మ జీవులు చనిపోయి పొలాల్లో తిరిగే పాములు, ముంగీసలు, ఉడుములు, తొండల ఇలా అనేక రకాల జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని పంట దిగుబడులు తగ్గిపోతాయి. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు కబ్జాల దగ్గరే ఉంటే దాన్యం కాలిపోయే ప్రమాదం ఉంది.



**" కలియ దున్నితే లాభాలు "**

వరి కొయ్యలు నేలలో కలియ దున్నటం వల్ల సేంద్రీయ కర్బన శాతం పెరిగి దిగుబడులు 5 నుండి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. ఫలితంగా డిఏపి వాడకం సగ్గం వరకు తగ్గుతుంది కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను ఎరువు తయావుతుంది. మొక్కలకు 2 శాతం నత్రజని 4 శాతం ఫాస్పరస్ అదనంగా అందుతుంది. నేలలో కరగని మూలకాలను అనుకూలంగా మార్చు తుంది .నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. కొయ్యకాళ్లను భూమిలో కలియదున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి. పొలం దున్నే 10 రోజులు ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి తరువాత ఎకరాకు 50 కిలోల సూపర్ ఫాస్పేట్ చల్లాలి దీంతో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడమే కాకుండా భూమిలో సేంద్రియా పదార్థాల స్థాయిని పెంచవచ్చని అని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు తోపాటు విఈఓ నిఖిల రైతులు పాల్గొన్నారు.

# న్యాయవాదులపై దాడులు లేకుండా రక్షణ కల్పించాలి

ప్రజాపక్షం/మెదక్ :రాష్ట్రంలో పని చేస్తున్న 50 వేల మంది న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని వారికి రక్షణ కావాలంటే తెలంగాణ అడ్వొకేట్ ప్రొటెక్షన్ చట్టం ఏర్పాటు చేసి అమలు చేయాలని హైకోర్టు సీనియర్ అడ్వకేట్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు రాపోలు భాస్కర్ డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమస్యలను పరిష్కారం కోసం, ప్రజలకోసం పనిచేసే వ్యక్తిని బార్ కౌన్సిల్ మెంబర్ గా గెలిపించాలని కోరారు. గురువారం తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యునిగా పోటీచేస్తున్న సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ మెదక్ జిల్లా కోర్టులో న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. రెండు సంవత్సరాలకు ఒక సారి జరగాల్సిన కౌన్సిల్ ఎన్నికలు గత ఏడున్నర సంవత్సరాలుగా జరగకపోవడం శోచనీయమన్నారు. 2026 జనవరి 31 లోగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో గత్యంతరం లేక ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 25 మంది కౌన్సిల్ సభ్యులు, అందులో నుంచి చైర్మన్ ఎన్నుకున్నట్లయితే న్యాయవాదుల సంక్షేమం, దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో పని చేస్తున్న న్యాయవాదులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల మీద పోలీసులు క్రిమినల్ కేసులు పెట్టి పిడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో అడ్వకేట్ల కు 25 కోట్ల ఇప్పించడం భాస్కర్ తెలిపారు.రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, వారి సంక్షేమం, ఆర్థిక భద్రత కోసం నెలకు 5 నుంచి 10 వేల వరకు స్టైఫండ్ ఇవ్వాలని, ఇందుకోసం ప్రయత్నం చేస్తానన్నారు. జూనియర్ న్యాయవాదుల నైపుణ్యాభివృద్ధి కోసం, హైదరాబాద్ లో నా సొంత నిధులతో లీగల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి, నిరంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి, కొత్త చట్టాలు, చట్ట సవరణలు, ముఖ్యమైన కోర్టు తీర్పులపై, ప్రముఖ న్యాయవాదులు న్యాయమూర్తులతో సెమినార్లు అన్ని జిల్లాల కోర్టు సముదాయాల్లో నిర్వహించుటకు కృషి చేస్తానన్నారు. న్యాయవాదుల సంక్షేమం, ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య బీమా పరిమితిని 2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేదా స్థలాలు లేని ఆర్థికంగా వెనుకబడిన న్యాయవాదులకు ఇళ్లు, ఇల్లు స్థలాలు ప్రభుత్వం కేటాయించాలన్నారు.బార్ కౌన్సిల్ పరిపాలన పారదర్శకత కోసం ప్రతి 6 నెలలకు ఒకసారి ఆదాయ వ్యయాలపై శ్వేత పత్రం విడుదల చేయడానికి కృషి చేస్తాను. 2019 నుంచి నమోదైన న్యాయవాదులందరికి హెల్త్ కార్డులు, అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ రాని న్యాయవాదులు కూడా స్టాండింగ్ నిబంధన లేకుండా తగిన ఫీజుతో లబ్ది పొందేలా కృషి చేస్తానన్నారు. 41ఏ లేదా బీఎన్ఎస్ఎస్ 35 యొక్క దుర్వినియోగం నియంత్రించేందుకు కృషి చేస్తానని భాస్కర్ పేర్కొన్నారు. నోటరీ నోటిఫికేషన్ విడుదల, నోటరీ అపాయింట్ మెంట్ కోసం కృషి చేస్తాని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన సీనియర్ అడ్వకేట్ కు పెన్షన్ లేదా రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, న్యాయవాదులందరికీ మరణానంతర లబ్ధిని 20 లక్షలకు పెంపుతో పాటు కాంగ్రెస్ పార్టీ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో న్యాయవాదులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## బూస రామస్వామి కుటుంబానికి పల్లా పరామర్శ

ప్రజాపక్షం/తరిగొప్పుల: బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త బూస యాదగిరియాదవ్ తాత రామస్వామి అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి,సీనియర్ నాయకులు జంలాల్ నాయక్, పద్మజా వెంకటరెడ్డి, లింగం, రాజారామ్, ప్రభుదాస్, రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవి, రాజేశ్వర్‌గౌడ్, పోచయ్య, రమేష్, తదితరులున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి

ప్రజాపక్షం/దేవరుప్పుల: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మెరుగు ఇస్తారు కుమారుని వివాహం ఇటీవల జరుగగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వారి ఇంటికి వెళ్లి ఆశీర్వదించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన కైరిక రమ, ధూమాల గట్టయ్య వాళ్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, మైసారావ్, మోహన్, ప్రవీణ్, ఇంద్రస్వామి, యాకస్వామి, కాసిం, శ్రవణ్, గ్రామ స్థాయి నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఆన్‌లైన్ కేంద్రాల ఏర్పాటు

ప్రజాపక్షం/పాలకుర్తి: ప్రజలకు అందుబాటులో ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటుచేయడం అభినందనీయమని టిపిసిసిఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా, కాంగ్రెస్ పార్టి మండల యూత్ ఉపాధ్యక్షుడు పసులాది ప్రశాంత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన జనతా కన్సల్టెన్సీ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఝాన్సిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటుచేయడం ద్వారా ప్రజలకు అవసరాలకు ఉపయోగపడుతాయన్నారు. ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నాయకులు, తదితరులున్నారు.

## జీడికల్ దేవస్థానం హుండీ లెక్కింపు



ప్రజాపక్షం/లింగాలఘణపురం:ప్రముఖ ప్రసిద్ధిగాంచిన, పుణ్యక్షేత్రమైన మండలం లోని జీడికల్ గ్రామంలో లోని గల శ్రీ జీడి కంటి వీరాచల శ్రీరామచంద్రస్వామి దేవాలయంలో, దేవాలయ ఈవో సి వంశీ, నల్గొండ, దేవాదాయ శాఖ, ఇన్స్పెక్టర్, ఎన్.నిఖిల్ ఆధ్వర్యంలో, గురువారం రోజున ఉండి లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం, దేవాలయ ఈవో సి వంశీ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలలో ఏర్పాటు చేసిన, హుండీలను, లెక్కింపు చేయగా, హుండీ ఆదాయం , 257868, రూపాయల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. గత సంవత్సరం, 277299, రూపాయల, ఆదాయం, ఎక్కువగా, ఈ బ్రహ్మోత్సవాల్లో ఆదాయం తగ్గినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో దేవాలయ సిబ్బంది, భరత్, మల్లేశం, అర్చకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా జరగాలి

ప్రజాపక్షం/జనగామ :నామినేషన్ పక్రియ సజావుగా జరగాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ఎన్నికల సంఘం నియమాలను పక్కాగా పాటించాలన్నారు. మొదటి వడతగా చిల్పూర్, స్టేషన్‌ఘనపూర్, రఘునాథపల్లి, జఫర్‌గడ్, లింగాలఘనపురం మండలాల్లో పంచాయతీ ఎన్నికలు జరగనుండగా గురువారం జిల్లా కలెక్టర్ చిల్పూర్ మండలం చిన పెండ్యాల గ్రామంలోని పంచాయతీని సందర్శించారు. నామినేషన్ స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్ పక్రియ సజావుగా నిర్వయించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా నామినేషన్లు పూర్తి చేయాలన్నారు. నోటిఫికేషన్ ప్రక్రియలో భాగంగా నోటీస్ ప్రదర్శించిన విధానాన్ని కలెక్టర్ వివరించారు. నామినేషన్ స్వీకరణ సమయంలో ఆర్‌వో, ఏఆర్‌ఓలు ఏఏం చెక్ చేయాలో క్షుణంగా పరిశీలించాలన్నారు. అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పక్రియను నిర్వయించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేయలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వాహనకు సంబంధించ ఎలాంటి సందేహాలు ఉన్నా పై అధికారులను సంప్రదించాలన్నారు.

**వసతి గృహాల విద్యార్థులు షెటర్స్ పంపిణీ**

జిల్లాలోని ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాల్లో విద్యనభ్యసించే విధ్యార్థులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ గురువారం షెటర్లు పంపిణీ చేశారు. జనగామలోని ఎస్సీ బాలికల వసతి గృహం బాలుర వసతి గృహం, ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహం, బాలుర కళాశాల వసతి గృహంలో షెటర్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ బి విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ప్రజాపక్షం/తొర్రూరు : మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ధర్మారపు కిరణ్‌లతో పాటు పలువురు కార్యకర్తలు, పెద్దమంగ్యా తండాలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు గురువారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. పెద్దవంగర మండలంలోని ఆర్సీ తండాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ అమల సక్రునాయక్, సీనియర్ నాయకులు బొజ్యానాయక్, నెహ్రూనాయక్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఝాన్సీరాజేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ పటిష్ట కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమాచారాన్ని అందించేందుకు టీ పోల్ యాప్

ప్రజాపక్షం/భూపాలపల్లి :గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సౌకర్యవంతంగా ఎన్నికల సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన టి పోల్ మొబైల్ యాప్ గూగుల్ ప్లే స్టోర్ లో అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ యాప్ ద్వారా ఓటర్లు పోలింగ్ కేంద్ర వివరాలు, ఓటర్ స్లిప్పు నమోదు సమాచారం సులభంగా తెలుసుకో గలుగుతారని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించుకోవాలని కోరారు. జిల్లాలో ఓటరు అవగాహన, ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. గూగుల్ ప్లే స్టోర్ లింక్: https://play. google.com /store/ apps/details?id=com.cgg.gov.in.te poll telugu ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకుని ఓటింగ్‌లో ప్రక్రియలో పాల్గొనాలని అయన సూచించారు.

## శాంతి భద్రతలకు సహకరించాలి

### జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పి శిరిశెట్టి సంకీర్త్

ప్రజాపక్షం/భూపాలపల్లి :శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పి శిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ యాక్ట్ 1861 నిబంధనలు( నవంబర్ 1 నుండి 30 వరకు) అమలులో ఉంటాయని తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదు. నిబంధనలకు విరుద్ధంగా డీజే సౌండ్ సిస్టమ్ వినియోగించరాదు. శాంతిభద్రతలకు భంగం కలిగించే, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్ట వ్యతిరేక చర్యలు చేపట్టరాదు.శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తున్న నేపథ్యంలో, ప్ర జలు పోలీసులకు సంపూర్ణ సహకారం అందించాలని ఎస్పి విజ్ఞప్తి చే శారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

ప్రజాపక్షం/తొర్రూరు : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని వెలికట్ట గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తక్కళ్లపల్లి దేవేందర్‌రావు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు నిర్వహించారు. పార్టీ నాయకుల అభిప్రాయం మేరకు మాజీ సర్పంచ్ బందు శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బత్తుల యాకయ్య, పోసాని రాములు, లింగారావు, బాలకృష్ణ, రాజారాం, కుమారస్వామి, బందు రవి, కొమ్ము రాములు, కొమిరెల్లి, కరుణాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతికి కేయూలో డాక్టరేట్



ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్ఎం విభాగ పరిశోధకురాలు ఎస్. స్వాతికి పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల డాక్టరేట్ ప్రకటించారు, డాక్టర్ ఎస్. స్వాతి స్టేటస్ ఆఫ్ ఉమెన్స్ సానిటరీ వర్కర్స్ ఇన్ మున్సిపల్ కార్పొరేషన్ ఏ స్టడీ ఆఫ్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అనే అంశం పై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో పూర్తి చేసారు, కటక్షాపూర్ గ్రామం, ఆత్మకూరు మండలం, హనుమకొండ జిల్లా కు చెందిన డాక్టర్ ఎస్. స్వాతి ని పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని కూనూరు గ్రామానికి చెందిన చాగంటి రుద్రయ్య (57) మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ రామారావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కూనూరు గ్రామానికి చెందిన రుద్రయ్య తనకు ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ ఉండేవాడని బుధవారం అతను మద్యం సేవించి ఇంటికి రావడ ంతో భార్య మందలించడంతో క్షణికావేశంలో ఇంట్లో ఉన్న గుర్తు పురుగుల మందుతాగగా అతని కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకునిధర్యాప్తుచేయడంజరుగుతుం దన్నారు.

# 4వ తేదీన క్రిస్మస్ వేడుకలు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** పట్టణంలో డిసెంబర్ నెలలో 4వ తేదీన జనగామ పట్టణ క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని రెవరెండ్ జి నర్సింగరావు పాస్టర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా రెవరెండ్ డా. పాల్ ఇమానుయేల్ క్రైస్ట్ టెంపుల్ విజయవాడ వారు స్వస్థత వరములు, ఇంటర్నేషనల్ సువార్తికులు వస్తున్నారన్నారు. కావున పట్టణ ప్రజలు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేడుకల కార్యదర్శి పాస్టర్ ఎం జేమ్స్ డేవిడ్, ట్రెజరర్ ఏఎస్‌పాదం, ప్రాన్సిస్, బాబురావు, సామ్సన్, శైలేష్, రాజశేఖర్, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

# చిరుతపులి పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలకేంద్రం శివారులో చిరుతపులి సంచరిస్తున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో మండలకేంద్రానికి చేందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ హెచ్ కోమి మండలప్రజలను ఉద్దేశించి ఒకప్రకటన విడుదల చేశారు .ఈసంధర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వేలేరు మండలకేంద్రంశివారులో చిరుతపులి సంచరిస్తునట్టు వివిధసామాజిక మాధ్యమాలలో వస్తున్న నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు ఎవ్వరికైనా చిరుతపులి కానీ చిరుతపులి ఆనవాల్లు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం సమాచారం అందించాలని కోరారు.

# శామీర్‌పేట గ్రామ మాజీ సర్పంచ్‌కి ఘన నివాళులు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** మండలంలోని శామీర్‌పేట గ్రామ మాజీ సర్పంచ బనుక బాలరాజు యాదవ్ దశదిన కర్మలో గ్రామ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి బాలరాజు గ్రామానికి చేసేన సేవలను కొనియాయారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగరావు, గ్రామ పెద్దలు బిక్షపతి, జంపన్న, సంపత్, చందు, రాజు, సిద్ధిరాజ్, బాలరాజు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**కాంగ్రెస్ పార్టీ నుండి అధికమంది సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి, చిట్యాల, మండలాల్లోని అన్ని గ్రామాల ముఖ్య నాయకులతో జరిగిన సమావేశం లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే నాయకులకు పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించుకోవాలని, వీలైనన్ని ఎక్కువ గ్రామాలు ఏకగ్రీవం అయ్యేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విరిజర్వేషన్లు వచ్చిన గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడైనా ఆర్థికంగా బలహీనంగా ఉంటే, ఆ గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు ఆ అభ్యర్థి విజయానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, రాష్ట్ర అధికార ప్రతినిధి గజర్ల అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధు వంశీ కృష్ణ, మండల అధ్యక్షులు కోటగిరి సతీష్, చిట్యాల మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లెల్లో స్థానిక ఎన్నికల సందడి

**ప్రజాపక్షం/కాళేశ్వరం:**పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో పల్లె గ్రామాల్లో రాజకీయ సందడి వేడెక్కింది. పార్టీ రహితంగా పంచాయతీ ఎన్నికలు జరుగనున్నప్పటికి అధికార,విపక్ష పార్టీలు తమ పార్టీ అభ్యర్థులను రంగంలో దింపి గెలుపుకోసం ప్రయత్నాలు ము మ్మరం చేశాయి. దీంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారి వేడెక్కింది. అధిష్టానం సూచించిన ఒకే అభ్యర్థి మాత్రమే పోటీలో ఉండాలని అధికార పార్టీ నుండి జిల్లా,మండల నేతలకు సంకేతాలు గెలుపు గుర్రాల అభ్యర్థులు వేట కొనసాగుతున్నాయి. కొన్ని గ్రామాలలో అధికార కాంగ్రెస్ పార్టీలో పోటీ పడే అభ్యర్థులు ఎక్కువగా ఉండటంతో తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పలువురు కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్ మకాం మార్చి జిల్లా ఇంచార్జి, మంత్రుల ఆశీస్సులు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. బిఆర్ఎస్ పార్టీలో పోటీలో ఉండే అభ్యర్థులు అంతంత మాత్రానికే పరిమితం కావడంతో గట్టి అభ్యర్థిని రంగంలోకి దింపి సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రశాంతంగా పల్లెల్లో రాజకీయ హడావుడి ఆసక్తికరంగా మారింది.

# పలు కార్యక్రమాలకు హాజరైన యువ నాయకులు

## కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలో జరిగిన పలు కార్యక్రమాలకు కాంగ్రెస్ యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారు. శ్రీనిధి గార్డెన్స్‌లో జరిగిన విలేకరి మంచాల సంతోష్ కుమార్ కూతురి శారీ ఫంక్షన్‌కు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం బచ్చన్నపేట మాజీ సర్పంచ్ నల్లగోని బాలకిషన్ తమ్ముని దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొనడంతోపాటు పెదరాంచర్ల గ్రామంలో దయాకర్‌రెడ్డి మామ దశదిన కర్మలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లి మెజార్టీ సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జి హరిబాబు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ మసూద్, జంగిటి విద్యానాథ్, భాస్కర్, మహిపాల్‌రెడ్డి, రమేష్, శ్రీనివాస్, ఆగయ్య, నరేష్, కర్రె నరేష్, కిష్టయ్య, యాదగిరి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలలో తొలిరోజు 35 నామినేషన్‌ల దాఖలు



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** గ్రామ పంచాయితి ఎన్నికల నేపథ్యంలో రఘునాథపల్లి మండలంలో గురువారం నామినేషన్ ప్రక్రియకు ఏడు క్లస్టర్ల వారీగా అధికారులు ఏర్పాటుచేయగా తొలి రోజు 35 సర్పంచ్ నామినేషన్లు దాఖలు కాగా, 8 వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలియజేశారు. అందులో క్లస్టర్ల వారీగా సర్పంచ్ నామినేషన్ల దాఖలు ఇలా ఉన్నాయి. అశ్వరావుపల్లి క్లస్టర్‌లో వెల్ది నుండి 1, యాపలగడ్డ తండ నుండి 4, కుసుంబాయి తండా నుండి 1, ఖిలాషాపూర్ క్లస్టర్లో మంగల్‌బండ తండా నుండి 1, మేకల గట్టు క్లస్టర్లో మేకల గట్టు నుండి 3, రామరాయిని బంగ్లా నుండి 3, గిద్ద బండ తండా నుండి 1, మాదారం క్లస్టర్‌లో పతే షాపూర్ నుండి 1, ఇబ్రహీంపురం నుండి 3, రఘునాథపల్లి క్లస్టర్‌లో రఘునాథపల్లి నుండి 1, కుర్చపల్లి నుండి 3, కోమల్ల నుండి 1, గోవర్ధనగిరి నుండి 1, నిడిగొండ క్లస్టర్‌లో బానాజీపేట నుండి 2, కంచనపల్లి క్లస్టర్లో కంచనపల్లి నుండి 2, శివాజీనగర్ నుండి 1, గబ్బెట నుండి 2, కోడూరు నుండి 2, కన్నయ్యపల్లి నుండి 2 నామినేషను దాఖలు కాగా, 8వ వార్డు మెంబర్‌ల నామినేషన్‌లు దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు.

# సిపిఐతోనే గ్రామాల అభివృద్ధి




**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** సిపిఐ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కావటి యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని శ్రీమన్నారాయణపురం గ్రామంలో సిపిఐ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇటుకల హనుమాజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి యాదగిరి హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయితి ఎన్నికలలోసిపిఐ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను, వార్డు మెంబర్లను గెలిపించాలని మండల ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు కంచనపల్లి గ్రామంలో 10 కుటుంబాలు సిపిఐ పార్టీలో చేరగా వారిని సిపిఐ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రేణుబాబు, బిక్షపతి, యాదగిరి, గౌరయ్య, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# నూతన డిసిసి అధ్యక్షుడిని కలిసిన భద్రకాళి ధర్మకర్తలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:**హన్మకొండ జిల్లా డిసిసి అధ్యక్షుడిగా ఎన్నికైన ఇనుగాల వెంకట్రాంరెడ్డిని భద్రకాళి ఆలయ ధర్మకర్తలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్ కుమార్ రెడ్డి, వీరన్న, పూర్ణచందర్, మయూరి రాము, తదితరులు ఉన్నారు.

# విద్యార్థులలో సైన్స్ ఆసక్తిని పెంపొందించడానికే ఇన్నోవేషన్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**విద్యార్థులలో సైన్స్ పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు నాణ్యమైన విజ్ఞాన విద్యను అందించేందుకు ప్రథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టెమ్ ఎడ్యుకేషన్ ఫర్ ఇన్నివేషన్ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం విద్యా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చాంబర్ లో ప్రథం ఫౌండేషన్ బృందంతో కలిసి, జిల్లాలోని పాఠశాలల్లో సైన్స్ బలోపేతానికి చేపట్టనున్న కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ అంశాలపై అవగాహన పెంచేలా ఆన్లైన్ వీడియోలు, టీచర్లకు ప్రత్యేక గైడెన్స్, స్టెమ్ ఆధారిత బోధన విధానాలు అమలు చేయనున్నట్లు ఆయన వివరించారు. ప్రథం ఫౌండేషన్ ద్వారా అందించే స్టెమ్ ప్రోగ్రామ్‌ను జిల్లాలోని ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఫౌండేషన్ అందించే బోధన సామగ్రి (మెటీరియల్) అన్ని పాఠశాలలకు చేరే విధంగా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి బి.స్వామి, ఏఎమ్ఓ విజయపాల్ రెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ రాజగోపాల్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల రిసోర్స్ పర్సన్స్, ప్రథం ఫౌండేషన్ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్‌పిని కలిసిన గౌడ సంఘం నాయకులు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్‌పిగా సిరిశెట్టి సంకీర్త్ గౌడ్ ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్‌పిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా నాయకులు కొండపాక సాంబయ్య గౌడ్, ముంజల రవీందర్ గౌడ్, పానుగంటి శ్రీనివాస్ గౌడ్, పెరుమాండ్ల తిరుపతి గౌడ్, ముత్యాల రాజబాబు గౌడ్, నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, బుర్ర లక్ష్మణ్ గౌడ్ , తదితరులు పాల్గొన్నారు.